లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లా షరీక లక లబ్బైక్ ఇన్నల్ హమ్ద వన్నిమత లక వల్ ముల్క్ లా షరీక లక

# ఏపి హజ్ బుల్లెటిన్

తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురితం

సంపుటి 3 సంచిక 4

**మే - 2019**

**రమదాన్, హి[్రజీ 1440**

బిస్మిల్లాహ్ హిర్రహ్మా నిర్రహీమ్

**అమిత దయాళువు, అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో...**

**ఈ సంచికలో...**

| | |
|---|---|
| **హజ్ మూడవ రోజు** | **3** |
| **రమదాన్ మాసం విశిష్టత** | **5** |
| **రమదాన్ శుభాలు** | **10** |
| **షబె ఖద్ర్ మరియు ఏతెకాఫ్** | **16** |
| **సైన్స్ దృక్కోణంలో రమజాన్ ఆరాధనలు!** | **22** |

చీఫ్ ఎడిటర్,

**ఎస్.ఎం.డి.తాజుద్దీన్ ఆరీఫ్**

ఎడిటర్

**డా.ఫజులుల్లా ఖాన్**

## ఏ.పి.హజ్‌బుల్లెటిన్ చదవాలనుకుంటున్నారా?

వెంటనే చందాదారులుగా చేరండి. హజ్-ఉమ్రా విధివిధానాలను ఖురాన్ హదీస్‌ల ఆధారంగా ఇస్లామిక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో “ఏ.పి.హజ్‌బుల్లెటిన్”ను ఏపి హజ్ కమిటీ ప్రచురిస్తోంది. చందా వివరాలు విడి ప్రతి రూ.15/- సంవత్సర చందా రూ.85/- (**డ్రా తేదీ నుంచి హాజ్‌యాత్రకు వెళ్ళే వరకు**). చందా మొత్తాన్ని ఏపి స్టేట్ హజ్ కమిటీ, అకౌంట్ నెంబర్: 034310100141377 ఐఎఫ్ఎస్‌సి కోడ్: ఎఎన్‌డిబి0000343 ఆంధ్ర బ్యాంక్ లబ్బీపేట్ బ్రాంచ్, విజయవాడలో జమా చేయాలి.

## ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాం

ప్రతి నెల విడుదలౌతున్న హజ్‌బుల్లెటిన్‌లో ప్రచురించడానికి ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి హజ్, ఖురాన్, హదీస్‌కు సంబంధించిన ఆర్టికల్స్ (తెలుగు - ఉర్దూ భాషలో డిటిపి చేయించి ఓపెన్ ఫైల్ aphajjpro@gmail.comకు మెయిల్ చేయాలి). ప్రింట్ అవుట్ కానీ, రాత ప్రతిని కాని పంపరాదు.

సంవత్సర చందా 85/-

విడిప్రతి వెల: **15/-**

ప్రచురణ

**ఏపి స్టేట్ హజ్ కమిటీ**

మసీదు వీధి, లబ్బీపేట్, విజయవాడ

టోల్‌ఫ్రీ నెం: 18004257873

**RNI No: TELBIL/2017/73690**

**Edited, Printed & Published by MD Tajuddin Aref, E.O. AP Haj Committee, 3rdFloor, # 39-3-2, Mosque Street, Labbipet, ViJayawada, AP. Printed at AP Haj Committee Vijayawada. Editor: Dr.Fazalullah Khan**

**EMail:aphajcommittee@gmail.com,Website:apstatehajcommittee.com**

**Postal No.VJ/197/2018/20**

అస్సలాము అలైకుమ్ వ రహ్మాతుల్లాహి వ బర్కాతహు వ మగిరతహూ.....

# రమదాన్ ముబారక్

ఆది మానవ కాలం నుండి అంతిమ కాలం వరకు మానవుడు ఈ భూమిపై ఎలా జీవితం గడపాలని సృష్టికర్త మానవాళికి తెల్పిన ధర్మమే ఇస్లాం. ఇస్లాంలో ఉన్న విషయాలను ఖురాన్‌లో తెలియజేశాడు సృష్టికర్త. రమదాన్ నెలలోనే ఖురాన్ అవతరించింది. ఇది కేవలం ముస్లింల కొరకు మాత్రమే అవతరించిన గ్రంథం కాదు. మొత్తం మానవజాతి మార్గదర్శకత్వం కోసం అవతరించిన గ్రంథం. మానవుడు తన జీవిత కర్తవ్యాన్ని బాధ్యతలని నెరవేర్చి, పరిపూర్ణ జీవితాన్ని తృప్తిగా జీవించాలి అని ఖచ్చితంగా చెప్పిన గ్రంథం ఖురాన్ ఒక్కటే. జీవితం నుంచి భయపడి పిరికితనంతో పారిపొమ్మని ఎక్కడా చెప్పలేదు. పలాయన వాదాన్ని సమర్థించలేదు, పూర్తిగా సంతృప్తిగా సంపూర్ణంగా జీవితాన్ని జీవించు అని నిర్దేశించి చెప్పింది ఖురాన్.

ఖురాన్‌లో ఒక మనిషికి కావాలసిన అన్ని అంశాలు చెప్పబడ్డాయి. అసలు ఎవరిని ఆరాధించాలి. ఎవరిని వివాహమాడాలి, ఎవర్ని వివాహమాడకూడదు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి, పురుషుని బాధ్యతలు ఏమిటి, స్త్రీల పట్ల ఎలా వ్యవహరించాలి, బంధుమిత్రుల పట్ల ఎలా మెలగాలి, అనాధల పట్ల ఎలా మెలగాలి, ఆర్థికపరమైన లావాదేవీలు, యుద్ద రంగంలోను వ్యవహరించవలసిన నియమ నిబంధనలు, మానవతా ధర్మాలు ఇలాంటి మరెన్నో విషయాలు ఇందులో విశదీకరించబడ్డాయి.

మనిషి పుట్టుక ఆధారంగా ఏర్పడిన ఆధిక్యత నుంచి విముక్తి కలిగించింది ఖురాన్. సర్వ సమానత్వాన్ని బోధించింది. ప్రజల్ని పీడించే ప్రభుత్వం, వివేక రహితమైన శాసనం, ఆధిక్యతతో అధికారం చెలాయించే దుర్మార్గులు, వ్యాధిబాధలు, వృద్దాప్యం, మరణం, దారిద్ర్యం, అవమానం, ప్రలోభం ఇటువంటి వాటిలో దేనిని చూసి భయపడకు అని మనిషిని శక్తి మంతునిగా, వీర పురుషునిగా తీర్చిదిద్ది అతను దృఢచిత్తంతో నిలబడగల మార్పు తీసుకొస్తోంది ఈ దివ్య ఖురాన్.

సాటి మనిషి పట్ల అధికారదర్ప ప్రదర్శన, మానవుని తెలివి తేటలను అణిచి వెయ్యగల ఆధిక్యత, భావ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛాయుత ఆలోచనల్ని నాశనం చేసే మానవ కట్టుబాట్లను ఖురాన్ తుడిచి వేసింది. మానవులందరూ సమానమే అనే ఏక దృష్టితో, సమ దృష్టితో చూడాలంటోంది ఖురాన్. మానవ జాతి అంతా ఒక్కటే అనీ, కుటుంబాలూ, కులాలు, తెగలూ అన్నీ పరస్పరం పరిచయ సాధనాలే అని ఖురాన్ స్పష్టం చేస్తోంది.

నీతిని, న్యాయాన్ని ఏ కారణం చేత ఎటువంటి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టరాదని ఖురాన్ చెబుతోంది. ఆత్మాభిమానాన్ని వదులుకోరాదని ప్రభోధించి వ్యక్తి గౌరవానికి, మానవునిలో స్వతంత్రతా భావబీజాలు నాటి కొత్త బాట వేసింది ఖురాన్. మానవ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సామాజిక సమానత్వపు చైతన్యం, నీతిమంతమైన ఆలోచనలు గల అపూర్వ పునాదుల్ని పరిపూర్ణంగా వివరించి వాటి ఆధారంగా మానవ సమాజాన్ని నిర్మించింది ఖురాన్. అల్లాహ్ ఒక్కడే ఆరాధ్యుడని ఖురాన్ తెలిపింది. ఇందులో ప్రతి విషయం క్షుణంగా అర్థమయ్యేలా చెప్పబడింది. ఇందులో ప్రతి చిన్న, పెద్ద విషయాలు క్షుణంగా ప్రస్తావించబడ్డాయి.

**- ఎస్.ఎం.డి.తాజుద్దీన్ ఆరీఫ్**
చీఫ్ ఎడిటర్

# హజ్ మూడవ రోజు

-ముఫ్తి ముహమ్మద్ ఫారూఖ్ అల్ ఖాశిమీ

**ఫజ్ర్ నమాజ్ ప్రారంభవేళలో చదవండి. ఆ తర్వాత అల్లాహ్ స్మరణలో మరియు దుఆ చేయడంలో గడపండి.**

**సూర్యోదయం అయిన తరువాత అక్కడి నుంచి మినా వైపుకు పయనాన్ని ఆరంభించండి.**

ముజ్‌దలిఫహ్ నుంచి మినా 7 కి.మీ. దూరంలో వుంది. నడిచి వెళ్తే 2 గంటల సమయం పడుతుంది. అక్కడికి చేరుకొని ఈ రోజు మీరు ఎన్నో పనులు చేయవలసియుంటుంది. మొదటి పని ఏమిటంటే మీరు మూడు జమ్‌రాలలో (వీటిని ప్రజలు 'షైతాన్‌లు' అని పేర్కొంటారు) అన్నింటికంటే చివరగా ఉండే మూడవ జమ్‌రహ్‌పై ఏడు కంకరరాళ్ళు విసురుతారు. నేడు ఆ కంకరరాళ్ళతో మిట్టమధ్యాహ్నా వేళకు ముందే కేవలం ఆ ఒక్క జమ్‌రహ్ పై మాత్రమే కొట్టాలి.

కంకరరాళ్ళు విసిరేందుకై జమ్‌రహ్ నుంచి రెండు లేదా రెండున్నర గజాల దూరంగా ఏవిధంగా నిలబడాలంటే మినా మీకు కుడివైపున ఉండాలి, మక్కా ఎడమవైపున ఉండాలి. ఏడు కంకరరాళ్ళను ఏడు పర్యాయాలు మీ చూపుడువేలు మరియు బొటనవేలితో పట్టుకొని విసర వలసియుంటుంది. ప్రతి రాతిని విసిరే సమయంలో ' బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ ' అని పఠించాలి.

**తల్‌బియహ్ ముగింపు**

హజ్‌కు సంబంధించిన ఇహ్‌రామ్ కట్టుకున్నప్పుడు ఆరంభమయిన తల్‌బియహ్ ('లబ్బైక అల్లాహుమ్మ లబ్బైక లబ్బైక లా షరీక లక లబ్బైక ఇన్నల్ హమ్‌ద వన్నిఅ్‌మత లక వల్ ముల్‌క లా షరీక లక్' అనే సద్వచనం), దేనినయితే మీరు నడుస్తూ, ఎక్కుతూ, దిగుతూ ప్రతి చోటా పఠించారో అది నేడు ఈ కంకరరాళ్ళను కొట్టిన తర్వాత దాని పరంపర ముగిసిపోతుంది. ఇప్పుడు మీరు అల్లాహ్ స్మరణకు సంబంధించిన ఇతర సద్వచనాలను పఠిస్తూ ఉండండి. ఇక తల్‌బియహ్‌ను పఠించడానికి సంబంధించిన ఆదేశం ఇప్పటి నుంచి మీకు వర్తించదు.

**ఖుర్‌బానీ**

ఆ విధంగా కంకరరాళ్ళను విసిరిన తర్వాత మీరు ఖుర్‌బానీ ఇవ్వవలసియుంటుంది. దీనికి సంబంధించిన నియమమేమిటంటే ఏ హజ్ యాత్రికులయితే 'హజ్జె తమత్తుత్ ' చేస్తారో లేదా 'హజ్జె ఖిరాన్' చేస్తారో వారు ఒక్క ఖుర్‌బానీ ఇవ్వడం వాజిబ్ (తప్పనిసరి). ఏ హజ్ యాత్రికులయితే హజ్జె ఇఫ్‌రాద్ చేస్తారో వారు ఖుర్‌బానీ ఇవ్వడం వాజిబ్ (తప్పనిసరి) కాదు, ముస్తహబ్ మాత్రమే. మీరు హజ్జె తమత్తుత్ చేశారు గనుక మీరు ఖుర్‌బానీ ఇవ్వడం వాజిబ్ (తప్పనిసరి). కనుక కంకరరాళ్ళను విసిరిన తర్వాత మీరు నేరుగా ఖుర్‌బానీ ఇవ్వబడే స్థలానికి చేరుకొని అక్కడ మీకు ఇష్టమయిన ఖుర్‌బానీ జంతువును కొనుగోలు చేసి ఖుర్‌బానీ ఇవ్వండి.

హజ్ ఏ తమత్తు మరియు హజ్ ఏ కిరాన్ చేసే వారికి గల మధ్య తేడా హజ్ ఏ కిరాన్ చేసేవారికి ఏమిటంటే, హజ్ ఏ కిరాన్ చేసేవారు ఉమ్రా చేసిన తర్వాత ఇహ్రం ను తీసివేయకూడదు, ఆ విధంగా ఈ ఇహ్రామ్ జుల్ హజ్జా ఎనిమిదవ తేదీ వరకు ఉండాలి, ఈ రోజే హాజీలు హజ్జ్ చేయడానికి నిశ్చయించుకుంటారు.

హజ్ చేయని వారు ఈద్ ఉల్ అద్ హా రోజున ఖుర్బానీ ఇవ్వాలి, ఇది జుల్ హజ్ లోని పదవ తేదీ, ఈ రోజును ఉదియహ్ అని అంటారు.

**హదీస్** : సాలిం ఇబ్న్ అబ్దుల్లాహ్ ఉల్లేఖనం ప్రకారం ఇబ్న్ ఉమర్ (ర.జి) ఇలా చెప్పారు: ఇబ్న్ ఉమర్ (ర.జి) వారి అంతిమ హజ్ సమయంలో, అల్లాహ్ ప్రవక్త ఉమ్రా చేసిన తర్వాత హజ్ చేశారు. అలాగే హదియ్ (ఖుర్బానీ ఇచ్చే జంతువును) కూడా తీసుకెళ్ళారు. ఆ తర్వాత అయన సఫా మరియు మర్వా దగ్గరకు వెళ్లి వాటి మధ్యలో ఏడు సార్లు పరిగెత్తారు ఆ తర్వాత ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు పూర్తి హజ్ అయ్యేవరకు మరియు(జుల్ హజ్ పదవ తేదీ)

అనగా నహర్ రోజు హదీయ్ అనగా ఖుర్బానీ ఇచ్చేవరకు ఇహ్రామ్ స్థితిలో నిషేధించబడ్డ పనులను ప్రవక్త చేయలేదు. ఆ తర్వాత త్వరగా మక్కా వైపు వచ్చి కాబా దగ్గరికి వెళ్లి తవాఫ్ చేశారు, ఆ తర్వాత ఇహ్రామ్ స్థితిలో నిషేధించబడిన పనులు అన్నీతవాఫ్ తర్వాత అనుమతించబడ్డాయని, అని ఇబ్న్ ఉమర్(ర.జి) తెలియజేశారు. సహీహ్ అల్-బుఖారీ, 1691 మరియు సహీహ్ ముస్లిం 1227

ఏ హజ్ యాత్రికుడు కూడా ఖుర్బానీనీ తన దేశంలో ఇస్తానని నిశ్చయించుకోకూడదు, ఎందుకనగా ఖుర్బానీ హజ్‌లోని ఒక ఒక మూలస్థంభం, కాబట్టి ఖుర్బానీ మక్కాలోనే ఇవ్వాలి. ఒకవేళ హాజీ ఏదైనా చేసినందుకు దాని బదులుగా హజ్‌లో ఖుర్బానీ ఇవ్వాలనుకోవడానికి కూడా అనుమతిలేదు, అలాగే తన దేశంలో కూడా ఇవ్వడానికి అనుమతి లేదు, కాబట్టి కేవలం ఖుర్బానీ మినా లేదా మక్కాలోనే ఇవ్వాలి.

అబ్దుల్అజీం ఆబాది ఇలా చెప్పారు: మక్కాలోనీ హరం దగ్గర ఏ ప్రదేశంలోనైనా జంతు ఖుర్బానీ ఇవ్వవచ్చు. విద్వాంసుల దృష్టిలో మినాలో ఖుర్బానీ ఇవ్వడాన్ని ఉత్తమంగా పరిగణించారు.

ఖుర్‌బానీ ఇచ్చిన తర్వాత తల వెంట్రుకలను గొరిగించుకోండి లేదా (ఒకవేళ తలవెంట్రుకలు ఒక గణపు కంటే ఎక్కువగా ఉన్న పక్షంలో) వాటిని కత్తిరింపజేయండి. కానీ ఇంతకు ముందు పేర్కొన్నట్లుగా వాటిని గొరిగించడమే ఉత్తమం. ఖుర్‌బానీ కొరకు మరొక వ్యక్తిని వకీలుగా సైతం చేయవచ్చు. కానీ తలవెంట్రుకలను గొరిగించడం లేదా కత్తిరించడం ఖుర్‌బానీ ఇచ్చిన తర్వాతే జరగాలి. కొంత మంది ఇస్లామీయ పండితులు ఖుర్‌బానీ ఇవ్వడానికి ముందు సైతం చేయవచ్చని పేర్కొన్నారు.

**ఇహ్‌రామ్ ముగింపు:** ఇప్పుడు మీరు హజ్ కొరకు కట్టుకున్న ఇహ్‌రామ్ కట్టుబాటు సైతం ముగిసిపోయింది. ఇక ఇప్పుడు మీరు కుట్టబడిన దుస్తులను ధరించవచ్చు. అలాగే భార్యతో లైంగికకార్యంలో పాల్గొనడం మినహా ఏయే పనులయితే ఇహ్‌రామ్ కారణంగా మీ కొరకు నిషిద్ధమయ్యాయో వాటన్నింటినీ చేయవచ్చు.

ఈరోజే మీరు మక్కాకు వెళ్ళి తవాఫె జియారత్ చేయవలసి యుంటుంది. అందుకే మీరు ఖుర్‌బానీ ఇచ్చిన తర్వాత తలవెంట్రుకలను గొరిగించుకున్న పక్షంలో లేదా కత్తిరించుకున్న పక్షంలో స్నానం చేసి దుస్తులు మార్చుకొని లేదా ఇహ్‌రామ్ దుస్తులలోనే అదే స్థితిలో మక్కాకు వెళ్ళిపోండి. అక్కడికి చేరుకున్న తర్వాత ఇంతకుముందు మీరు ఏవిధంగానయితే తవాఫ్ చేసియున్నారో అదేవిధంగా తవాఫ్ చేయండి. అది తవాఫె జియారత్‌గా పేర్కొనబడుతుంది. ఆ తవాఫ్ చేసిన తర్వాత భార్యతో లైంగికకార్యంలో పాల్గొనడం సైతం ధర్మసమ్మతమయిపోతుంది మరియు ఇహ్‌రామ్ పూర్తిగా ముగిసిపోతుంది.

తవాఫ్ పూర్తయిన తర్వాత రెండు రకాతులు నమాజ్ చదవండి, ముల్‌తజిమ్ వద్దకు వెళ్ళి ప్రార్థించండి. ఆ తర్వాత హజ్రె అస్వద్‌ను చుంబించి సఫా మరియు మర్‌వహ్‌ల వద్ద సఈ చేసేందుకై బయలు దేరండి. ఏ విధంగానయితే మొదటిరోజు ఉమ్రహ్‌కు సంబంధించిన తవాఫ్ చేసిన తర్వాత ఉమ్‌రహ్‌కు సంబంధించిన సఈ చేశారో అదేవిధంగా ఈరోజు తవాఫె జియారత్ తర్వాత హజ్‌కు సంబంధించిన సఈ చేయండి.

సఈ చేసిన తర్వాత మస్జిదె హరామ్‌కు వచ్చి ముతాఫ్ లో ఒకవేళ హజ్రె అస్వద్ ముందు అవకాశం లభించిన పక్షంలో అక్కడ, లేకుంటే ఎక్కడ వీలయితే అక్కడ రెండు రకాతులు నఫిల్ నమాజ్ చదవండి. (ఈ తవాఫె జియారత్ మరియు ఆ తర్వాతి సఈ ను ఒకవేళ ఏదయినా కారణం చేత జిల్‌హజ్జహ్ మాసపు 10 వ తేదీన చేయలేని పక్షంలో జిల్‌హజ్జహ్ మాసపు 12వ తేదీన సూర్యాస్తమయ వేళకు ముందు వరకు చేయవచ్చు.

## తవాఫె జియారత్ తర్వాత మినాకు వెనుదిరిగి రావడం

నేడు మినా నుంచి మక్కాకు రావడమనేది ఈ తవాఫ్ మరియు సఈ ల కొరకు మాత్రమే జరుగుతుంది. ఈ పనులను ముగించిన తర్వాత తిరిగి మినాకు వెళ్ళవలసి యుంటుంది.

# రమదాన్ మాసం విశిష్టత

-ముఫ్తి ముహమ్మద్ ఫారూఖ్ అల్ ఖాశిమీ

**ఖుర్ఆన్ 'అల్ బఖరహ్' సూరహ్‌లో ఒక చోట ఈ విధంగా పేర్కొనబడింది**

**"యా అయ్యుహల్లజీన ఆమనూ కుతిబ అలైకు ముస్సియామ కమా కుతిబ అలల్లజీన మిన్ ఖబ్‌లికుమ్ లఅల్లకుమ్ తత్తఖూన్"**

"ఓ విశ్వాసులారా! మీకు పూర్వపు ప్రజలపై ఏ విధంగానయితే ఉపవాసాలు విధి కావించబడ్డాయో అదే విధంగా మీపై సైతం విధి కావించబడ్డాయి. మీరు దైవభీతి పరులుగా రూపొందేందుకై".

రమదాన్ మాసం ఇస్లామీయ కేలెండర్ రీత్యా ఎంతో ప్రసిద్ధమైన, విశిష్టమైన మాసం. రమదాన్ మాసం నిత్యం ప్రాముఖ్యతను కలిగియున్న మాసంగా విరాజిల్లింది. రమదాన్ మాసాన్ని అల్లాహ్ తన మాసంగా పేర్కొనడాన్ని బట్టి రమదాన్ మాసం విశిష్టతను మనం గ్రహించవచ్చు.

రమదాన్ అనేది అరబీ భాషకు చెందిన పదం. రమజ్ అనే అరబీ పదానికి కాల్చివేసేది అని అర్థం. ఏ విధంగా నయితే అగ్ని కట్టెను కాల్చివేస్తుందో అదే విధంగా రమదాన్ మాసం మానవుల పాపాలను భస్మీపటలం గావించి వేస్తుంది. అలాగే దుష్కార్యాలకు పాల్పడిన కారణంగా మానవుల హృదయాలకు ఏర్పడే తుప్పును రమదాన్ వదిలించివేసి పాపాల నుంచి మానవులను ప్రక్షాళనం గావిస్తుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) దైవప్రవక్త పదవి లభించిన తర్వాత 13 సంవత్సరాల పాటు మక్కాలోనే ఉండి ప్రజలకు అల్లాహ్ ఆదేశాల గురించి తెలియజేస్తూ ప్రచారం చేస్తూ ఉన్నారు. అయితే మక్కా వాసులు ఆయనను హిజ్రత్ చేసేలా ఒత్తిడికి గురి చేసినప్పుడు ఆయన(స) మక్కాను విడిచిపెట్టి మదీనా వైపుకు వెళ్ళారు. అక్కడ అన్నింటికంటే మొదట ముహర్రమ్ నెల 10వ తేదీ(ఆషూరహ్) ఉపవాసముండడం ఫర్జ్(విధి) అయినది. అయితే హిజ్రత్ జరిగిన ఒకటిన్నర సంవత్సరాల తర్వాత అనగా హిజ్రీశకం 2వ సంవత్సరం షాబాన్ నెల 10వ తేదీన సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ రమదాన్ నెల ఉపవాసాలను ఫర్జ్ (విధి) గావిస్తూ ఆదేశాలను అవతరింప జేయడం జరిగింది. ఇక అప్పటి నుంచి ముహర్రమ్ నెల 10వ తేదీన విధి అయినటువంటి ఉపవాసం రద్దు గావించ బడింది. ఇక అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా ప్రకటించారు. "ఇక ఇప్పటి నుంచి ఎవరయితే ఆషూరహ్ ఉపవాసం పాటించదలుచుకుంటారో వారు పాటించవచ్చు. ఎవరయితే పాటించదలుచుకోరో వారు పాటించకుండా ఉండవచ్చు." ('జాదుల్ మారిజ్, పేజీ: 160)

ఇస్లామీయ పండితులు ఈ విధంగా పేర్కొన్నారు. "దైవప్రవక్త హజ్రత్ ఆదమ్(అ) అల్లాహ్‌చే నిషేధించ బడిన వృక్షఫలాన్ని తిన్నప్పుడు ఆయన కడుపులో దాని ప్రభావం నెల రోజుల పాటు ఉన్నది. ఆ తర్వాత అల్లాహ్ ఆయన తౌబహ్‌ను స్వీకరించినప్పుడు పరిహారంగా నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండవలసిందిగా హజ్రత్ ఆదమ్(అ)ను ఆదేశించాడు. ఆ ఆదేశమే ఆయన సంతతి కొరకు సైతం జారీ చేయబడింది. ఆ విధంగా పూర్తిగా నెల రోజుల పాటు ఉపవాసాలు పాటించ వలసిందిగా ఆదేశాలు అవతరించాయి.

రమదాన్ మాసం సర్వసృష్టికర్త అయిన అల్లాహ్ తరపున ఒక అమూల్యమైన కానుక అయిన కారణంగా అందులోని ఒక్కొక్క రోజు మరియు ఒక్కొక్క ఘడియ మరియు ఒక్కొక్క నిమిషం సైతం ఎంతో విలువయింది. మరియు విలువ ఇవ్వదగినది. దాని ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) రమదాన్

మాసం మొదలవడానికి ముందే తన సహచరులను సమీకరించి ప్రసంగించేవారు. రమదాన్ మాసం విశిష్టతను తెలియజేసి అందులో ఆరాధనల్లో పాల్గొనే విషయంలో సహచరులను ప్రోత్సహించేవారు.

హజ్రత్ ఉబాదహ్ బిన్ సామత్(రజి) ఈ విధంగా ఉల్లేఖించారు. రమజాన్ మాసం సమీపంలో ఉండగా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ప్రజలరా! రమదాన్ మాసం రాబోతోంది. అది ఎన్నో శుభాలను కలిగియున్న మాసం. అల్లాహ్ అందులో మీ వైపు ప్రత్యేకమైన రీతిలో దృష్టిని సారించడం జరుగుతుంది. అలాగే అందులో మీ పై ప్రత్యేకంగా తన అనుగ్రహాలను కురిపించడం జరుగుతుంది. మీ పాపాలను క్షమిస్తాడు. మీ ప్రార్థనలను స్వీకరిస్తాడు. మీరు పుణ్యఫలాలను ఆర్జించడంలో పోటీలు పడడాన్ని చూసి తన దూతల ముందు, అల్లాహ్ తన భక్తుల గురించి గొప్పగా చెబుతాడు. కనుక మీరు సృష్టికర్త అయిన అల్లాహ్‌కు మీ పుణ్యఫలాలను చూపించండి. ఈ మాసంలో సైతం అల్లాహ్ కారుణ్యానికి దూరంగా ఉండే వ్యక్తి ఎంతో దౌర్భాగ్యుడు.

పైన పేర్కొనబడిన హదీసులో సృష్టికర్త అయిన అల్లాహ్ తన దాసుల విషయంలో తన దూతల ముందు గొప్పగా చెబుతాడని దైవప్రవక్త(స) పేర్కొన్నారు. దీనికి భావమేమిటంటే అల్లాహ్ తన తొలి ప్రవక్త అయిన హజ్రత్ ఆదమ్(అ)ను సృష్టించదలచినప్పుడు అందుకు సంబంధించిన సమాచారాన్ని తన దూతలకు అందజేస్తూ ఈ క్రింది విధంగా పలకడం జరిగింది.

"ఇన్నీ జాఇలున్ ఫిల్ అర్జి ఖలీఫహ్" (నేను భువిలో నా ప్రతినిధిని సృష్టించబోతున్నాను. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి?'' అప్పుడు దైవదూతలు ఒక్క స్వరంతో ఉమ్మడిగా ఈ విధంగా పలికారు. "అతజ్అలు ఫీహా ముయ్యుఫ్సిదు ఫీహా వ యస్ ఫికుద్దిమా" (ఓ ప్రభువా! నీవు భువిలో అలజడిని సృష్టించే వారిని, రక్తపాతాన్ని సృష్టించేవారిని, ఒకరిపై మరొకరు దైర్జన్యానికి అన్యాయానికి పాల్పడేవారిని సృజించబోతున్నావా?) అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు. "ఇన్నీ అలము మాలా తలమూన్'' (నాకు ఏదయితే తెలుసో అది మీకు తెలియదు. మీకు తెలియని విషయాలన్నింటికీ సంబంధించిన జ్ఞానం నాకు ఉంది) అందుకే అల్లాహ్‌కు చెందిన సజ్జనులయిన దాసులు ఆయనను ఆరాధించినప్పుడు దాని పట్ల సంతోషించి అల్లాహ్ తన దూతలను సంబోధించి ఈ విధంగా పలుకుతాడు. "చూడండి! మీరు ఏ ఆదమ్ సంతతి గురించయితే వారు రక్తపాతం సృష్టిస్తారని పేర్కొన్నారో వారే వీరు''

కొద్దిపాటి సత్కార్యానికి పాల్పడి మనం ఎంతగా అల్లాహ్‌కు ప్రియులైన దాసులుగా మారిపోతామో కాస్త ఆలోచించండి. చివరకు పవిత్రమైన జీవరాశి అయిన దైవ దూతల ముందు సైతం మన సృష్టికర్త మన పట్ల గర్వించడం జరుగుతుంది. ఇప్పుడు సైతం మనం సుఖ భోగాలలో మునిగితేలుతూ అల్లాహ్ పట్ల విధేయులయి నడుచుకునే, సత్కార్యాలకు పాల్పడే విషయంలో నిర్లక్ష్యం గా వ్యవహించినట్లయితే అందకు మించిన దుర్మార్గం మరేముంటుంది? ఆ విధంగా వ్యవహరిస్తూ మనం ఎంతటి విలువయిన సమయాన్ని చేజేతులా కోల్పో తున్నామో మనం గ్రహించవలసిన ఆవశ్యకత ఉంది. ఈ కారణంగా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇటువంటి వ్యక్తుల గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు. "ఈ మాసంలో సైతం అల్లాహ్ కారుణ్యానికి దూరమయి పోతే వ్యక్తి ఎంతో దౌర్భాగ్యుడు.

రమదాన్ మాసం విశిష్టతకు సంబంధించి ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. 'బుఖరీ షరీఫ్' అనే గ్రంథం లో ఒక హదీసు ఈ విధంగా పేర్కొనబడియున్నది. దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు. "ఏ వ్యక్తయితే విశ్వసించి పుణ్యఫలం లభిస్తుందని సంకల్పిస్తూ రమదాన్ నెలలో ఉపవాసాలు పాటిస్తాడో అతడు అప్పటి వరకు చేసిన పాపాలన్నీ క్షమించివేయబడతాయి''.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) రమదాన్ మాసం విశిష్టతను తెలియజేస్తూ మరొక చోట ఈ విధంగా

అన్నారు. "మాసాలన్నింటికీ రమదాన్ నాయకురాలు. ఎందుకంటే రమదాన్ మాసం ఎన్ని విశిష్టతలను కలిగియు న్నదంటే వాటన్నింటినీ ఇతర మాసాలు కలిగి లేవు. ఏ రాత్రినయితే (షబెఖద్ర్‌ను) అల్లాహ్ ఖుర్ఆన్‌లో వెయ్యి మాసాల కంటే శ్రేష్టమైనదిగా పేర్కొన్నాడో అది రమదాన్ మాసంలోనే ఉన్నది. అలాగే పవిత్ర ఖుర్ఆన్ గ్రంథం రమదాన్ మాసంలోనే అవతరించింది. విస్తృతమైన పుణ్యఫలం శిక్ష నుంచి విముక్తి షైతాన్‌లను కట్టడి చేయడం, సత్కార్యాలు చేసే విషయంలో మరియు అల్లాహ్ పట్ల విధేయతతో నడుచుకునే విషయంలో రమదాన్ మాసం విశిష్టతను తెలియజెప్పేందుకు చాలు. రమదాన్ మాసానికి చెందిన దినాలలో మామూలుస్థాయి సత్కార్యం సైతం అల్లాహ్‌చే స్వీకరించబడుతుంది. చిన్నపాటి సత్కార్యం సైతం రమదాన్ నెలలో ఎంతో విలువయిన ఆచరణగా అల్లాహ్‌చే పరిగణించబడుతుంది. రమదాన్ మాసపు దినాలలో ముస్లింలు లేవడం, కూర్చోవడం, ఆరాధన కొరకు నడవడం, మేల్కోవడం, తినడం, త్రాగడం వంటి చర్యలన్నీ పుణ్యఫలానికి దోహద పడతాయి. అటువంటి ప్రతి చర్యకు ప్రతిగా అల్లాహ్ తన దాసులకు ఎంతో పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు. రమదాన్ నెలలో ఒక నఫిల్ స్థాయి ఆరాధనకు ప్రతిగా లభించే పుణ్యఫలం ఫర్జ్ ఆరాధనకు ప్రతిగా లభించే పుణ్యఫలానికి సమానమయిపోతుంది. అలాగే రమదాన్ నెలలో ఒక ఫర్జ్ నమాజ్‌కు ప్రతిగా లభించే పుణ్యఫలం 70 రెట్లు పెంచి వేయబడుతుంది. అందుకే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా చెప్పారు. "ఈ మాసంలో ఏ వ్యక్తయితే ఒక నఫిల్ ఆరాధనలో నిమగ్నుడవుతాడో అతడికి రమదాన్ కాకుండా మిగిలిన మాసాలలో ఒక ఫర్జ్ ఆరాధనలో నిమగ్నమయినందుకు ప్రతిగా లభించే పుణ్యఫలానికి సమానమైన పుణ్యఫలం ప్రసాదించ బడుతుంది. అలాగే ఏ వ్యక్తయితే రమదాన్ నెలలో ఏదయినా ఫర్జ్ ఆరాధనలో నిమగ్నుడవుతాడో అతడికి రమదాన్ నెల కాకుండా ఇతర మాసాలలో 70 ఫర్జ్ ఆరాధనల్లో నిమగ్నమయినందుకు ప్రతిగా లభించే పుణ్యఫలంతో సమానమైన పుణ్యఫలం ప్రసాదించబడు తుంది. సుబ్‌హానల్లాహ్! రమదాన్ నెలలో ఎంతటి స్థాయిలో అల్లాహ్ తన దాసులపై పుణ్యఫల వర్షాన్ని కురిపిస్తాడో గదా! ఆ విధంగా కురిపించడం అనంత కరుణామయుడు మరియు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ కొరకు ఎంత మాత్రం క్లిష్టతరం కాదు. కనుక ఈ విషయం ఆశ్చర్యకరమైదీ కాదు.

ఎందుకంటే సమయాలు మారడంతో పాటు వస్తువుల విలువలు సైతం మారిపోతూ ఉంటాయి. బంగారం మరియు వెండి ఒకానొక కాలంలో ఎక్కువ విలువను కలిగియుండేవి కావు. అవి సర్వ సాధారణంగా ప్రజలందరి వద్ద దాదాపుగా ఉండేవి. వాటిని ఆశ్చర్యపూర్వకంగా ప్రజలు చూసేవారు కాదు. కానీ పరిస్థితులు మారిపోయాయి. అవసరాలలో మార్పు సంభవించింది. అవసరాలు పెరిగి పోయాయి. దానితో వాటి విలువ అమాంతం పెరిగి పోయింది. అదే విధంగా ఫర్జ్ నమాజ్‌కు ప్రతిగా లభించే పుణ్యఫలం సైతం ప్రదేశాన్ని బట్టి మారుతూ ఉంటుంది. బైతుల్ ముఖద్దిస్, మస్జిదె నబవీ మరియు కాబా గృహం (బైతుల్లాహ్)లో ఫర్జ్ నమాజ్ చదవడం ఇతర ప్రదేశాలలో నమాజ్ చదవడం కంటే ఎంతో శ్రేష్టమైనదిగా పరిగణించ బడుతుంది. అదే విధంగా సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ రమజాన్ నెల ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంతగానో పుణ్యఫలాన్ని తనదాసులకు ప్రసాదిస్తానని వాగ్దానం చేయడం జరిగింది. తద్వారా ప్రజలు వీలయినంతగా సృష్టికర్త ఆరాధనల్లో నిమగ్న మవడం పట్ల దృష్టిని సారించే అవకాశమున్నది మరియు దైవప్రవక్త హజ్రత్ ముహ్మమద్(స) అనుచర సమాజం స్వర్గలోక ప్రవేశం కొరకు మార్గాన్ని సుగమం కావించుకునే అవకాశం ఏర్పడింది. కనుక ఇస్లాం ధర్మంపై మన ప్రాణాలు సమర్పితమవుగాక! రమదాన్ నెలలో ఒక ఫర్జ్ ఇతర మాసాలలో 70 ఫర్జ్‌లకు సమానమైనది. మనం విస్తృత స్థాయిలో పుణ్యఫలం ఆర్జించేందుకై కాబా గృహం వైపుకు ప్రయాణించవలసిన అవసరం లేదు. ఎటువంటి వీసాను, పాస్‌పోర్ట్‌ను పొందనవసరం లేదు. మన ఇంటిలో కూర్చొనే

అగణ్యమైన పుణ్యఫలం పొందే అవకాశం మనకు ప్రాప్తమయింది. రమదాన్ మాసం చంద్రుడిని చూసిన తర్వాత సైతం బద్ధకంతో ఉండిపోయేవారు ఎంతటి దౌర్భాగ్యుల్లో గదా! అటువంటి వ్యక్తులలో చైతన్యం ఏర్పడదు. వారి కాంక్షలో వృద్ధి జరగదు. రమదాన్ నెలలో సైతం వారు మస్జిద్‌కు దూరంగా ఉంటారు. ఇక రమదాన్ మాసానికి చెందిన ఒక్కొక్క ఘడియ మరియు ఒక్కొక్క నిమిషం విలువను గుర్తించే వ్యక్తులు ఎంతటి సౌభాగ్య వంతులో గదా! రమదాన్ మాసంలో సమయాన్ని వారు ఎంత మాత్రం వృధాగా పోనీయరు. అటువంటి వ్యక్తుల గురించే వీరు స్వర్గలోకానికి చెందిన ప్రత్యేకమైన 'రయ్యాన్' అనే ద్వారంగుండా స్వర్గంలోకి ప్రవేశించడం జరుగు తుంది. దైవదూతలు వారికి స్వాగతం పలుకుతూ ఉంటారు" అని పేర్కొనడం జరిగింది.

వాస్తవానికి ఈ మాసం ఆరాధనలకు సంబంధించిన వసంత మాసం ఏ విధంగానయితే ప్రతి పంట సంబంధిత కాలంలో పండ్లు ఫలాలతో వికసింస్తుందో అదే విధంగా ఈ మాసంలో ఆరాధనలు వృద్ధి చెందుతాయి. దాసులకు తమ సృష్టికర్త పట్ల విధేయులుగా నడుచుకునే విషయా లలో సద్బుద్ధి ప్రాప్తమవుతుంది. ఈ కారణంగానే ఎందరో వ్యక్తులు రమదాన్ మాసాన్ని ఎంతగానో గౌరవించి అందులో అత్యధికంగా ఆరాధనల్లో నిమగ్నమయ్యే విషయంలో ఎంతో శ్రద్ధగా వ్యవహరిస్తారు. పని, వృత్తి, పరిశ్రమలు, వ్యవసాయం మొదలయినవి సంవత్సరం పొడవునా కొనసాగుతూనే ఉంటాయి. అయితే పవిత్ర రమజాన్ మాసం సంవత్సరంలో ఒక్క పర్యాయం మాత్రమే వస్తుంది. తదుపరి సంవత్సరానికి చెందిన రమదాన్ మాసపు దినాలు ఎవరికి ప్రాప్తమవుతాయని, ఎవరికి ప్రాప్తం కావని వ్రాయబడినదో ఎవరికీ తెలియదు.

మహోన్నతమైన రమదాన్ మాసంలోనే పవిత్ర ఆకాశ గ్రంథాలు అవతరించాయి. అన్నింటికంటే ఆఖరి దైవగ్రంథ మయిన ప్రపంచంలో నిదురిస్తున్న జాతులన్నింటినీ చైతన్య వంతమైన జాతులుగా మలచివేసిన ఖుర్‌ఆన్ సైతం ఈ నెలలోనే అవతరించింది. అందుకే సృష్టికర్త అయిన అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు. ఈ రమదాన్ మాసంలోనే మానవులందరికీ మార్గదర్శకమైన ఖుర్‌ఆన్ గ్రంథం అవతరింపజేయబడింది.

**'రమదాన్ నెల మొదటి లేదా మూడవ తేదీన మానవుల ముక్తికి సంబంధించిన సందేశాన్ని కలిగియున్న సహీఫాలు (దివ్యప్రతులు) దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ)పై అల్లాహ్ తరఫున అవతరించాయి. రమదాన్ నెలలోనే దైవప్రవక్త హజ్రత్ దావూద్(అ) కాలంలో రమదాన్ నెల 12వ తేదీ 18వ తేదీన మానవుల ముక్తికి సంబంధించిన సందేశం 'జబూర్' గ్రంథం రూపంలో అవతరింపజేయ బడింది. రమజాన్ నెల 6వ తేదీన దైవప్రవక్త హజ్రత్ మూసా(అ)కు 'తౌరాత్ గ్రంథం' అందజేయబడింది. రమదాన్ నెల 13వ తేదీన దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)కు 'ఇంజీల్' అందజేయబడింది.**

రోజహ్ మరియు ఖుర్‌ఆన్ గ్రంథం ప్రళయదినాన దాసుని కొరకు సిఫారసు చేయడం జరుగుతుందని హదీసులో పేర్కొనబడింది. రోజహ్ (ఉపవాసం) ఈ విధంగా సిఫారసు చేస్తుంది. ఓ ప్రభువా నేను పగటి పూట ఈ వ్యక్తిని అన్న పానీయాల నుంచి మరియు మనో వాంఛల పరిపూర్తి నుంచి నిరోధించి ఉంచాను. కనుక ఇతడి విషయంలో నా సిఫారసును నీవు స్వీకరించు" ఇక ఖుర్ ఆన్ గ్రంథం ఈ విధంగా సిఫారసు చేస్తుంది. "నేను ఈ వ్యక్తిని రాత్రివేళ తరావీహ్ నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠనం కారణంగా మేల్కొని ఉండేలా చేశాను. కనుక ఇతడి విషయంలో నా సిఫారసును స్వీకరించండి" ఆ రెండింటి సిఫారసును అల్లాహ్ స్వీకరించడం జరుగుతుందని దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) పేర్కొన్నారు. ఈ హదీసు ద్వారా స్పష్టమైన రీతిలో రమదాన్ మాసానికి ఖుర్‌ఆన్‌తో ఎటువంటి సంబంధమున్నదో విదితమవుతోంది. ఈ కారణంగానే ప్రతి సంవత్సరం దైవదూత హజ్రత్ జిబ్రయిల్(అ) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) వద్దకు విచ్చేసి ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పూర్తిగా పఠించేవారు. ఖుర్‌ఆన్ పఠనం కొరకు అత్యుత్తమ విధానం తరావీహ్ నమాజ్. ఈ తరావీహ్ నమాజ్ ద్వారా ఖుర్‌ఆన్ పఠనం కూడా

పూర్తవుతుంది. అలాగే హాఫిజ్‌లు కాని వారు సైతం తరావీహ్ నమాజ్‌లో పాల్గొనడం ద్వారా ఖుర్‌ఆన్‌ను పూర్తిగా వినే సౌభాగ్యాన్ని పొందుతారు. అయితే మనం తరావీహ్ నమాజ్‌ను ఒక భారంగా భావించి చదవము. ఒక వేళ చదివినా మనం ఏ వలలో చిక్కుకున్నాము గదా! అని భారంగా భావిస్తూ చదువుతాము.

ఎంతటి శోచనీయమైన విషయమో గదా! సంవత్సరం లో ఒక పర్యాయం పవిత్రమైన రమదాన్ మాసం ప్రాప్తమయితే అందులోనూ ఒక దినానికి చెందిన 24 గంటలలో ఎక్కువ కాలాన్ని స్వీయకార్యాల కొరకే వెచ్చించి వేస్తాము. ఒక వేళ మనం తరావీహ్ నమాజ్ కొరకు కొంచెం కష్టపడితే ఏమవుతుంది? నమాజ్ కొరకు మస్జిద్‌కు వెళ్లిన తర్వాత కూడా త్వరత్వరగా నమాజ్‌ను ముగించేందుకు మనం ప్రయత్నించడమెందుకు?

హజ్‌రత్ మౌలానా అహ్మద్ సర్‌హిందీ(ర.అ) ఒక చోట ఈ విధంగా పేర్కొన్నారు. 'రమదాన్ మాసం పూర్తిగా కారుణ్యాలతో, శుభాలతో కూడుకున్నట్టిది. ఒక ఖుర్‌ఆన్ గ్రంథం పూర్తిగా విశిష్టతలను కలిగియున్నట్టిది. ఒక షబెఖద్ర్ ఈ మాసం యొక్క సారం. కనుక ఏ వ్యక్తయితే ఈ మాసంలో అల్లాహ్ ఆరాధనలో స్థిరంగా నిమగ్నుడవు తాడో అతడు సంవత్సర పర్యంతం అల్లాహ్ తరఫున శుభాలలో మునిగితేలుతాడు. కనుక!

మనం రమదాన్ మాసాన్ని స్వాగతించేందుకు సన్నద్ధులయిపోవాలి. ఏమరుపాటులోనే మనం సంవత్సర కాలాన్ని గడిపివేశాము. ఇప్పుడు మనం అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమయ్యేందుకు సన్నద్ధులు కావాలి. మనం 11 నెలల పాటు అల్లాహ్ ఆదేశాలను ధిక్కరిస్తూ గడిపివేశాం. ఈ రమదాన్ మాసంలో అందుకు పరిహారంగా ఆరాధనలో గడపాలి. మనం అల్లాహ్ పట్ల అవిధేయతతో వ్యవహరిస్తూ మన కర్మల పత్రాన్ని పాపాలతో నింపివేశాం.

కనుక ఈ పవిత్ర రమదాన్ మాసంలో మనం పుణ్యఫలాలను ఆర్జించుకోవాలి. ఒక వేళ రమదాన్ మాసంలో పాపకార్యాలకు సంబంధించిన ఊహ వచ్చి నట్లయితే సత్కార్యాల పట్ల స్థిరచిత్తాన్ని, సంకల్పాన్ని కలిగియుండడం ద్వారా దానిని తొలగించవచ్చు. ఒక వేళ మన మనసు చెడుగుల వైపుకు ప్రేరేపిస్తున్నట్లయితే మనం ఉపవాసం ద్వారా దానిని నిర్దాక్షిణ్యంగా అణచివేయవచ్చు.

మన జీవితాలలో ఈ మాసాన్ని సత్కార్యాలతో కూడుకున్నట్టిదిగా మలచుకునే దిశగా ప్రయత్నిస్తామని ప్రతినబూనుదాం. మన జీవితంలోని ఈ స్వల్ప సమయం పలురకాల సత్కార్య ఫలాలతో కూడిన ఉద్యానవనంగా రూపుదిద్దుకునేలా కృషి చేద్దాం. ఇందులో అల్లాహ్ ఆరాధన, దానధర్మాలు, విధేయత మొదలయిన పుష్పాలు వికసిస్తూ ఉంటాయి. వాటిని చూసి మన సృష్టికర్త మన పట్ల సంతుష్టి చెందాలి. ఆ విధంగా కృషి చేసే సద్బుద్ధిని అల్లాహ్ మనకు ప్రసాదించుగాక! ఆమీన్!

---

**రమజానుల్ ముబారక్ కా పహ్‌లా అష్‌రహ్ రహ్‌మత్ కా హై లిహాజా: పహిలే రోజేసే దస్ (10) వే రోజే తక్ ఇస్ దుఆకో కస్‌రత్‌సే పఢే.**

# అల్లాహుమ్మర్ హమ్‌నా యా అర్‌హమర్రాహిమీన్

**రమజానుల్ ముబారక్ కా దుస్‌రా అష్‌రహ్ మగ్‌ఫిరత్ కా హై లిహాజా: 11 వే రోజే సే (20)వే రోజే తక్ ఇస్ దుఆకో కస్‌రత్‌సే పఢే.**

# అల్లాహుమ్మగ్ ఫిర్‌లనా జునూబనా యారబ్బల్ ఆలమీన్

**రమజానుల్ ముబారక్ కా తీస్‌రా అష్‌రహ్ జహన్నమ్‌సే ఆజాదీ కా హై లిహాజా: 21 వే రోజే సే ఆఖరీ రోజే తక్ ఇస్ దుఆకో కస్‌రత్‌సే పఢే.**

# అల్లాహుమ్మగ్ ఖినా అజాబన్నార్ వ అద్‌ఖిల్‌నల్ జన్నత మఅల్ అబ్‌రార్

# యాఅజీజు యాగప్ఫార్ ఫిర్‌లనా జునూబనా యారబ్బల్ ఆలమీన్

# రమదాన్ శుభాలు

- డా.ఫజులుల్లాఖాన్

ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యల మూలాలు సామాజిక ఆర్థిక అసమానతల్లో ఉన్నాయనేది నిర్వివాదాంశం. వీటికి తక్షణ పరిష్కారాలుగా సోషలిజం, కమ్యూనిజం సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి. వాటి విశ్లేషణ అలా ఉంచితే అవి నిర్వహించిన ఉద్యమాలు పీడిత ప్రజలకు బాసటగా నిలిచాయనడంలో సందేహం లేదు. ఇస్లాంను అధ్యయనం చేసిన కారల్‌మార్క్స్ ఆలోచనల్ని పవిత్ర ఖుర్‌ఆన్ ప్రభావితం చేసిందంటే చాలామంది అంగీకరించకపోవచ్చునేమో కాని ఇదొక వాస్తవం. రమదాన్ మాసానికున్న విశిష్టత ఏమిటంటే సామాజిక, ఆర్థిక సమానత్వ ఆచరణకు సంబంధించిన స్ఫూర్తిని పొందడమే.

ఇస్లాం కలిమా, నమాజ్, జకాత్, రోజా, హజ్ అనే మూల స్థంభాలపై ఆధారపడి వుంది. ఇందులో జకాత్ చాలా ప్రధానమైనది. ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ముస్లిం తన సంపద నుండి పేదలకు జకాత్ చెల్లించాలి. ఇది దానం కాదు పేదల హక్కు అని ఇస్లాం చెప్తుంది. ఈ భావనే సోషలిస్టు భావాలకు పునాది వేసింది." వారి సంపాదనలో పేదలకు, అవసరార్థులకు హక్కు ఉంది" అని దివ్య ఖుర్‌ఆన్ చెప్తుంది. ఇస్లామియా చరిత్రలో తొలి ఖలీఫా అబూబకర్ సిద్దీఖ్ గారు నిరుపేదల హక్కు ఐన జకాత్ చెల్లించని ధనిక ముస్లింలపై యుద్ధం ప్రకటిస్తానని చెప్పారు. ధనిక వర్గం సాగించే దోపిడీని ఇస్లాం అంగీకరించదు. భూమిపై, దాని లోపల ఉన్న సంపద అంతా దైవానికే చెందుతుంది. వీటిపై మనిషి తాత్కాలిక అధికారాన్ని మాత్రమే పొందాడు. కనుక ఏ మనిషి తన సంపదను తన గుత్త సొత్తుగా భావించరాదు. సమాజం లోని ధనికులు తమ సంపదలోని కొంత భాగాన్ని ఖచ్చితంగా నిరుపేదలకు పంచితీరాలి. లేదంటే రాజ్యమే ఆ పని చేయాలి. ఒక ధనికుడు నిరుపేదల ఈ హక్కును తృణీకరించినంత కాలం అతని సంపద, అతని ఆత్మ ప్రక్షాళనం కాదని ప్రవక్త ముహమ్మద్(స) చెప్పారు.

## పండుగ నమాజ్‌కు ముందు

పండుగ నమాజుకు వెళ్ళక ముందు తమ తరపున మరియు తమ కుటుంబసభ్యులందరి తరపున బీదలకు జకాతుల్ ఫిత్ర్ చెల్లించవలెను. పండుగ నమాజుకు ముందుగాని, నమాజు అనంతరంగాని ఎలాంటి సున్నత్ నమాజు చేయరాదు. అల్లాహ్ యొక్క అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గానీ, ఆయన ప్రియ సహచరులు గానీ అలా చేసినట్లు ఆధారమేదీ లేదు. ఈ విషయంపై ఇస్లామీయ ధర్మవేత్తలం దరి మధ్య ఏకాభిప్రాయం ఉంది. అయితే, ఇక మిగిలినది **నఫిల్ నమాజులు:** వీటి గురించి (నఫిల్ చదవరాదని) ఏ హదీసులోనూ లేదు. గనక నఫిల్ నమాజులు పండుగకు ముందు మరియు తర్వాత కూడా చేసుకోవచ్చునేది కొందరు ధర్మవేత్తల దృక్పథం. కాని సాధారణంగా రోజు ఏ ఏ వేళల్లోనైతే నఫిల్ నమాజులు చేసేవారో, పండుగ రోజున కూడా ఆ వేళల్లోనే చేయాలన్నిది ఒక నిబంధన. అంతేకాక ఈ నఫిల్ నమాజు వలన పండుగ నమాజుకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూసుకోవలెను.

## ఫిత్రా దానము (జకాతుల్ ఫిత్ర్)

**ఫిత్రా దానము అర్థము:** ఈదుల్ ఫిత్ర్ పండుగకు ముందు ఆహారధాన్యాల నుండి (బియ్యం, గొధుమలు మొదలగు వాటి నుండి) ఒక "సా" (3 కేజీలు) బీద ముస్లిములకు దానం చేయుట. ఇది ఉపవాస స్థితిలో జరిగే చిన్నచిన్న తప్పులకు పరిహారము వంటిది.

**ఫిత్రా దానము విధి అగుటకు కారణము:** హదీస్‌లలో ఈ విధముగా తెలుపబడినది: ఇది ఉపవాసి యొక్క చిన్న చిన్న పొరపాట్లను దూరము చేయును. బీదవారు

కూడా అందరితో కలిసి పండుగ జరుపుకుంటారు, మరియు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ఎవరైతే మన చేత రమదాన్ నెల ఉపవాసములు పూర్తి చేయించి ఇస్లాం యొక్క ఒక మూల స్థంభముపై అమలు చేసే శక్తిని మనకు ప్రసాదించాడో.

**ఎవరిపై ఈ ఫిత్రా విధి చేయబడినది:** 'ప్రతి ఒక్కరిపై' అనగా అప్పుడే పుట్టిన శిశువునుండి, పెద్దవారి వరకు, మరియు బానిసల తరఫు నుండి, అందరి తరఫు నుండి ఆ ఇంటి పెద్ద ఫిత్రా దానము చెల్లించాలి.

"అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి ముస్లింపై, స్వతంత్రుడుగాని, బానిస గానీ, పురుషుడుగాని, స్త్రీ గానీ, పిల్లలు గానీ, పెద్ద వారు గానీ, అందరిపై ఒక 'సా' గోధుమలు లేదా ఒక 'సా' బార్లీ దానముగా తీయుటను విధిగావించిరి." (ముత్తఫఖున్ అలైహ్)

**ఫిత్రా దానము ఎవరికి చెల్లించాలి: బీద ముస్లిములకు.**

**ఫిత్రా దానము గురించి గుర్తుంచుకొన వలసిన విషయాలు:**

1. ఫిత్రా దానము ఈదుల్ ఫిత్ర్‌కు ముందు చెల్లించ వలెను.
2. ఈదుల్ ఫిత్ర్‌కు ఒకటి, రెండు రోజులు ముందుగా కూడా చెల్లించవచ్చును.
3. ఈదుల్ ఫిత్ర్ పండుగ తరువాత చెల్లించిన యెడల అది మామూలు దానము అగును. కనుక పండుగకు ముందే తప్పక చెల్లించవలెను.

## లైలతుల్ ఖద్ర్

ఈ నెలలో స్వర్గద్వారాలు తెరచి వేయబడ తాయి. నరకద్వారాలు మూసి వేయబడతాయి. షైతాన్లు బంధించబడతారు. వేయి నెలల కంటే శ్రేష్టమయిన రేయి ఒకటి ఈ నెలలోనే ఉంది. ఎవరయితే దాని శుభాలను కోల్పోతాడో, వాస్తావానికి అతడు ఎంతో దౌర్భాగ్యుడు.

## లైలతుల్ ఖదర్ దుఆ

(మేము ఖురఆన్‌ను ప్రాముఖ్యతగల రాత్రిలో అవతరింప జేశాము. ఆ ప్రాముఖ్యత గల రాత్రి 1000 నెలల కంటే ఉత్తమమైనది.

ఉమ్ముల్ మోమినీన్ ఆయషా(రజి) ఇలా ఉల్లేఖించారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను నేను లైలతుల్ ఖదర్ పొందిన యెడల ఏ దుఆ చేయాలి అని ప్రశ్నించగా, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. అల్లాహుమ్మ ఇన్నక అఫువన్ తుహిబ్బుల్ అఫువఫా అఫుఅన్నీ క్షమాపణను ప్రేమించే అల్లాహ్ నన్నుక్షమించు.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉద్బోధించారు. ఎవరైతే విశ్వాసంతో అల్లాహ్ స్వీకరణ కొరకు లైలతుల్ ఖదర్‌లో మేల్కొని ఆరాధనలు చేస్తారో అల్లాహ్ వారి మునుపటి పాపములను క్షమిస్తాడు.

## రోజా (ఉపవాసం)

ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు (ఖుర్ ఆన్ వచన భావపు అనువాదం)-'విశ్వసించిన ఓ ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది ఇదే విధంగా ఇది మీకు పూర్వం ప్రవక్తల్ని అనుసరించే వారి పై కూడా విధించబడింది దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది' (అల్ బఖర -183).

అసలు రోజా (ఉపవాసం) అంటే ఆపటం, ఆగి ఉండటం, అదుపు చేసుకోవటం, కట్టుబడి ఉండటం అనే అర్థాలు వస్తాయి. అయితే ఇస్లామీయ పరిభాషలో రోజా (ఉపవాసం) అంటే ఒక నిర్ణీత సమయంలో అన్నపానీయా లను, దాంపత్య సుఖాల్నీ త్యజించటం, లైంగిక వాంఛలను అదుపులో ఉంచుకోవటమని అర్థం. రోజానే 'సౌం/ సియాం' అని కూడా అంటారు. రోజే దార్ (ఉపవాసి)ని 'సాయిం' అని పేర్కొంటారు. ఉపవాసం (రోజా) యుక్త వయస్సుకు చేరిన ప్రతి ముస్లిం స్త్రీపురుషునిపై విధిగా నిర్ణయించబడింది. ఉషోదయానికి పూర్వం నుండి సూర్యా స్తమయం వరకు కేవలం అల్లాహ్ కోసం అన్నపానీయాలు విడనాడటాన్ని, దాంపత్య సుఖం నుండి దూరంగా ఉండటాన్ని రోజా (ఉపవాసం) అంటారు.

ఈ రోజాలను తిరస్కరించినవాడు కాఫిర్ (దైవధిక్కారి) అవుతాడు. ఎలాంటి సరైన కారణం లేకుండా రమదాన్ ఉపవాసాలను పాటించనివాడు ఘోర అపరాధం చేసిన వాడవుతాడు.

## యుక్త వయసు కాని పిల్లల పై ఉపవాసం

యుక్త వయసు కాని చిన్న పిల్లల పై ఉపవాసం తప్పనిసరికాదు. అయితే ఉపవాసం ఉండేందుకు చిన్ననాటి నుండే అలవాటు చేసుకోవటంలో తప్పు లేదు. పిల్లవాడికి 7 ఏండ్లు నిండితే నమాజ్ కోసం ఆజ్ఞాపించమని, 10 ఏండ్లు నిండిన మీదట కూడా పిల్లోడు నమాజ్ చేయకపోతే దండించి మరీ నమాజ్ చేయించాలని హదీసుల ద్వారా తెలుస్తోంది. చిన్నపిల్లల్లో ఎన్ని ఉపవాసాలు పాటించగల శక్తి ఉందో అన్ని ఉపవాసాలు పాటించనీయటం ఉత్తమం.

ఒక హదీసులో ఇలా ఉంది: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారని అబూ హురైరహ్ రదియల్లా అన్హు ఇలా ఉల్లేఖించినారు "మీపై ఒక శుభ ప్రదమైన నెల అవతరించనున్నది. దాని ఉప వాసాలను అల్లాహ్ మీపై విధిగా చేశాడు."

## ఇఫ్తార్

ఉపవాసం అంటే సూర్యోదయం నుండి సూర్యాస్తమం వరకు అన్నపానియాలకు దూరంగా ఉండడం. ఒక ముస్లిం సూర్యోదయానికి ముందు భోజనం చేసి ఉపవాసాన్ని ప్రారంభిస్తాడు మరియు సూర్యుడు అస్తమిం చిన తరువాత ఉపవాసాన్ని విరమిస్తాడు. ఉపవాసం విరమించే సమయంలో చేసే భోజనాన్ని ఇఫ్తార్ అంటారు.

అనస్(రజి) ఉల్లేఖించారు: "దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఉపవాసాన్ని మగ్రిబ్ నమాజ్ కు ముందు విరమించేవారు. ఉపవాస విరమణకు దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తాజా ఖర్జూర పండ్లు తీసుకునేవారు, అవి దొరకనిచో, ఎండు ఖర్జూర పండ్లు తీసుకునేవారు, అవి కూడా లభ్యం కాని పక్షంలో నీళ్ళతో ఉపవాసాన్ని విరమించేవారు." (సునన్ అబూ దావూద్ 2348, 2349 తిర్మిజి 3:79 రియాజుస్ సాలిహీన్ 1238, 1239)

## తొందరగా ఇఫ్తార్ చేయడం

ఇఫ్తార్‌లో తొందర చేయడం దైవప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం (సున్నత్) ఆచరణ. తొందర చేయడం అంటే, సూర్యుడు అస్తమించాక ఆలస్యం చేయకుండా వెంటనే ఇఫ్తార్ చేయాలి. కొందరు సూర్యుడు అస్తమించాక కూడా కాసేపు ఆగుతారు. ఇది యూదులు మరియు క్రైస్తవుల ఆచరణ. అందువల్లే దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం యూదులు మరియు క్రైస్తవులకు విరుద్ధంగా సూర్యుడు అస్తమించగానే ఆలస్యం చేయ కుండా ఇఫ్తార్ చేయాలి అని ఆదేశించారు.

సహల్ ఇబ్న్ సాద్ (రజి)ఉల్లేఖించారు:దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం ఇలా అన్నారు: "ఉపవాసాన్ని విరమించడంలో తొందర చేసినంత వరకు ప్రజలు మంచిగా ఉంటారు." (సహీహ్ బుఖారీ 3:178, సహీహ్ ముస్లిం 2417)

## ఇఫ్తార్ తరువాత చదివే దుఆ

కొందరు విద్వాంసుల ప్రకారం, షేక్ ఇబ్న్ ఉసైమిన్ అభిప్రాయ ప్రకారం ఇఫ్తార్ తరువాత ఈ దుఆ చదవవచ్చు. "జహబజ్ జమవు వబ్ తల్లతిల్ ఉరూఖు వ సబతిల్ అజ్రు ఇన్ షా అల్లాహ్"

అర్థం: దాహం తీరిపోయింది. నరాలు తడిసి పోయాయి. అల్లాహ్ తలిస్తే ప్రతిఫలం దొరుకుతుంది. (సునన్ అబీ దావూద్ 2357)

## ఉపవాసం భంగామవ్వడానికి గల కారణాలు

ఖుర్ ఆన్ మరియు హదీస్ ప్రకారంగా ఉపవాసం భంగామవ్వడానికి గల కారణాలు:

1. కావాలని తినడం త్రాగడం వలన
2. కావాలని వాంతి చేయడం వలన
3. స్కలనం చేసి ఉద్దేశ పూర్వకంగా వీర్యమును తీయడం
4. ఎక్కువగా రక్త దానం చేయడం వలన
5. ధూమపానం సేకరించడం వలన

6. బహిష్టు అయిన స్త్రీ
7. ప్రసవించిన స్త్రీ గడువుకాలం వరకు
8. భార్య భర్తలు సంభోగంలో కలవడం వలన

పైన మొదటి 5 విషయాల వలన ఉపవాసం భంగమయితే ఆమె లేదా అతను అల్లాహ్ ముందు పశ్చాత్తాపం పొందాలి.

మిగతా 6,7 వాటి వల్ల ఉపవాసం భంగమయితే వాటిని మిగతా నెలలలో పాటించాలి.

## ఉపవాసం భంగపరిస్తే దానికి పరిహారం

భార్య భర్తలు సంభోగంలో కలవడం వలన ఉపవాసం భంగమయితే ఈ క్రింది మూడి వాటిలో ఏదైనా కఫ్ఫారా విధించవచ్చు:

బానిసను విముక్తి చేయడం

ఎడతెగకుండా రెండు నెలలు ఉపవాసం

అరవై మంది పేదవారికి అన్నం పెట్టడం

పైనవన్నీ పరిహారం ఇవ్వడమే గాక పశ్చాత్తాపం కూడా చెందాలి. పశ్చాత్తాపం చెందలేకపోతే ఆ పరిహారం ఉపయోగపడదు.

## ఉపవాసం నుంచి మినహాయింపు

ఉపవాసం ఎవరెవరూ ఉండాలంటే యవ్వనస్తులు మరియు ఆరోగ్యంకల వ్యక్తి మరియు సామర్థ్యం కలిగి ఉన్న వ్యక్తికి ఉపవాస మినహాయింపు లేదు. ఉపవాసం ఎవరెవరికి మినహాయింపు ఉందో క్రింది వాటిని చూడండి.

1. మతిస్థిమితం లేని వాడు.
2. యుక్త వయస్సుకు చేరుకొని పిల్లలకు
3. యవ్వనస్తులై ఉండి కూడా ఉపవాసం ఉండడానికి పరిస్థితులు అనుకూలత లేనప్పుడు ఒక పేదవాడికి ఒక రోజు భోజనం తినిపించాలి.
4. గర్భంతో ఉన్న స్త్రీ తన ఉపవాసంను వాయిదా వేసుకోవచ్చు అనగా మిగతా రోజులలో పూర్తి చేయాలి.
5. ప్రయాణం చేసేవారు, అనారోగ్యంతో ఉన్నవారు.

## ఏ విషయాలు ఉపవాసంను భంగపరచవు

1. ఉపవాసం ఉన్నామని మరిచి తినడం మరియు తాగడం వలన.
2. అనుకోకుండా వాంతులు అయితే.
3. లాలాజలంను మింగడం వలన కాని, వీధి దుమ్ము వలన, పొగ త్రాగే వారి పొగ వలన ఉపవాసం భంగమవదు.
4. మిశ్వాక్‌తో పళ్ళు తోమడం వలన.
5. స్నానం చేయడం: ఉద్దేశపూర్వకంగా కాకుండా స్నానం చేసేటప్పుడు నీటిని మింగడం వలన ఉపవాసం భంగం కాదు. కాని ఇక్కడ గొంతులో నీటిని పోసుకొని పుక్కిలించడం అనే దానిని మాత్రం తిరస్కరించారు.

## ఈదుల్ ఫిత్ర్

హజ్రత్ అనస్ (రజిఅల్లాహు అన్హు) ఉల్లేఖించారు: మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చినపుడు, అక్కడి ప్రజలు ఏడాదిలో రెండు రోజులను ఆటల కోసం, సైరు షికార్ల కోసం పండుగ దినాలుగా ప్రత్యేకించుకోవటాన్ని గమనించారు. "ఏమిటీ ఆ రెండు దినాల విశేషం?" అని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిని ప్రశ్నించగా, వారు "అజ్ఞానం వల్ల మేము ఇందులో (ఈ రెండు రోజుల్లో) ఆడుకుంటాం, ఆనందాన్ని అనుభవిస్తాం" అని జవాబిచ్చారు. అపుడు ఆయన ప్రవక్త(స) ఇలా ఉపదేశించారు "ఈ రెండు రోజులను అల్లాహ్ మీకోసం ఇంతకంటే మేలైన పర్వదినాలుగా మార్చివేశాడు. వాటిలో ఒకటి ఈదుల్ ఫిత్ర్, రెండవది ఈదుల్ అద్ హా."

పండుగ రోజున, షరీఅత్ పరిధులలో స్వాదిష్టమైన ఆహార పదార్థాలు భుజించటం, శుభాకాంక్షలు తెలుపుకోవటం సంప్రదాయం. హజ్రత్ ఆయిషా (రఅ) ఇలా ఉల్లేఖించినారు: "ఒక పర్వదినాన నీగ్రోలు (నల్లవారు) మహాప్రవక్త దగ్గరికి విన్యాసాలు చేస్తూ వచ్చారు. నేను మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) భుజంపై నుండి తొంగి చూడసాగాను. (ఇది గమనించి) ఆయన

(సల్లల్లాహు అలైహి వసల్లం) తన భుజాన్ని క్రిందికి దించినారు. నేను ఆయన భుజంపై నుండి తనివి తీరా ఆ దృశ్యాన్ని తిలకించిన తరువాత అక్కడి నుండి ఇంటి లోపలికి వెళ్ళిపోయాను."(బుఖారి, ముస్లిం ,అహ్మద్ )

పండుగ రోజున స్నానం చేయటం, సుగంధ ద్రవ్యాలు పూసుకోవటం, ఉన్న వాటిలో నుండి మంచి దుస్తులు ధరించటం ఉత్తమం. ఇది మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆచరణ విధానం కూడా. ఈద్ నమాజ్ తమ బస్తి లేక గ్రామం బయట ఒక బహిరంగ ప్రదేశంలోని ఈద్ గాహ్‌లో చేయటం సున్నత్. సౌకర్యం లేని పక్షంలో మస్జిద్‌లో కూడా పండుగ నమాజ్ చేసుకోవచ్చు. ఈద్ నమాజ్ కోసం ఈద్ గాహ్ వైపుకు వెళ్ళేటప్పుడు బిగ్గరగా తక్బీర్ పలుకుతూ వెళ్ళాలి. ఈద్ గాహ్‌కు వెళ్ళేటప్పుడు ఒక దారిన, వాపసు వచ్చేటప్పుడు మరొక దారిన రావటం ఉత్తమం. పురుషులతోపాటు స్త్రీలు, పిల్లలు కూడా ఈద్‌గాహ్ వెళ్ళి, ఈద్ నమాజ్‌లో పాల్గొనటం కూడా ఒక సున్నతే.

## ఈద్ నమాజు

ఈదుల్ ఫిత్ర్(రమదాన్ పండగ) రమదాన్ నెల ఉపవాసములు పూర్తయిన తర్వాత షవ్వాల్ 1వ తారీఖున జరుపుకోబడును.

## ఈద్ నమాజ్ సమయం

సూర్యుడు ఉదయించి, సుమారు రెండు బారెళ్ళుపైకి రాగానే పండుగ నమాజు వేళ ప్రారంభం అవుతుంది. ఈదుల్ ఫితర్ నమాజును కాస్త ఆలస్యంగా, ఈదుల్ అద్ హా నమాజును కాస్త త్వరగా చేయటం మంచిది. మిట్టమధ్యాహ్నం దాటడంతోనే పండుగ నమాజు వేళ ముగుస్తుంది. హజ్రత్ జన్దుబ్ (రజిఅల్లాహు అన్హు) ఉల్లేఖనం: ఈదుల్ ఫిత్ర్ నమాజును మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చదివించేటప్పుడు రెండు బారెల్ల ప్రొద్దెక్కి ఉండేది. ఈదుల్ అద్ హా నమాజు చదివించేటప్పుడు ఒక బారెడు ప్రొద్దెక్కి ఉండేది. (అహ్మద్ నిన్ హసనుల్ బన్నా)

పండుగ నమాజు కొరకు అజాన్ మరియు ఇఖామత్ లేదు. పండుగ నమాజు కోసం అజాన్ యివ్వ కూడదు, అలాగే పండుగ నమాజుకు ముందు ఇఖామత్ కూడా లేదు. జుమా నమాజులో ఖుత్బా ప్రసంగం తర్వాత నమాజు జరుగును. అయితే పండుగ రోజున ముందు నమాజు, ఆ తర్వాత ఖుత్బా ప్రసంగం ఉంటుంది.

## సలాతుల్ ఈద్ షరతులు:

1. **సమయం:** సూర్యుడు ఉదయించిన 20 నిమిషాల తర్వాత సలాతుల్ ఈద్ సమయం ప్రారంభమగును. ఆలస్యం చేయకుండా ప్రారంభపు సమయంలోనే ఈద్ నమాజ్ పూర్తి చేయటం ఉత్తమం.
2. **సలాహ్:** సలాతుల్ ఈద్ రెండు రకాతులు బిగ్గరగా చదవవలెను. అదాన్ మరియు ఆఖామహ్ పలుక బడదు. మొదటి రకాతులో ప్రారంభ తక్బీర్ కాకుండా 6 తక్బీర్ లు అధికంగా పలుక వలెను. మరియు రెండవ రకాతులో 5 తక్బీర్ లు పలుక వలెను.
3. సలాతుల్ ఈద్ తర్వాత రెండు ఖుత్బాలు ఇవ్వబడును.

## సలాతుల్ ఈద్‌లోని సున్నతులు

1. స్నానం చేయుట, మంచి దుస్తులు ధరించుట, సువాసన పూసుకొనుట.
2. ఈదుల్ ఫిత్ర్‌లో బేసి సంఖ్యలో ఖర్జూరపు పళ్ళు తిని ఈద్ గాహ్‌కు వెళ్ళుట. సలాతుల్ ఈద్ పట్టణం లేదా గ్రామం బయటకు వెళ్ళి ఆచరించుట సున్నత్.
3. ఈదుల్ అద్ హా లో ఈద్ గా నుంచి వచ్చి ఖుర్బాని మాంసంతో భోజనం చేయుట ఈద్ గాహ్ వెళ్ళే టప్పుడు ఒకదారిన వచ్చేటప్పుడు వేరే దారిన రావటం.
4. తక్బీర్ అల్లాహు అక్బర్, అల్లాహ్ అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు, వల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, వలిల్లాహిల్ హంద్.

## పఠించవలసిన సూరాలు

ఈద్ నమాజు రెండు రకాతులు. ప్రతీ రకాతు లోను సూరహ్ ఫాతిహ్ పఠించిన తరువాత దివ్యఖుర్

ఆన్‌లోని మరే భాగమైనా పఠించవచ్చు. అయితే మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పండుగ నమాజులో స్వయంగా ఆ వేళల్లో ఏ యే సూరాలనైతే పఠించేవారో, ఆ సూరాలనే మనం కూడా పఠించటం ఉత్తమం. హజ్రత్ సమర (రజిఅల్లా అన్హు) ఉల్లేఖనం: "పండుగ నమాజులలో మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మొదటి రకాతులో (ఫాతిహా సూరా అనంతరం) 'సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా' మరియు రెండవ రకాతులో 'హల్ అతాక హదీసుల్ గాషిఅ' పఠించేవారు (అహ్మద్). మరో హదీసులో ఇలా ఉంది "'ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్ హా నమాజులలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏమి పఠించేవారు?' అని హజ్రత్ ఉమర్ (రజిఅయల్లా అన్హు) హజ్రత్ అబూ వాఖిద్ లేసీ (రజిఅల్లా అన్హు)ను దర్యాప్తు చేయగా 'ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సూరహ్ ఖాఫ్ మరియు సూరహ్ ఖమర్ పఠించే వారని' ఆయన జవాబిచ్చినారు". ఈద్ నమాజు సామూహికంగా చేయాలి మరియు ఖుర్ఆన్ పఠనం బిగ్గరగా చేయాలి .

## పండుగ నమాజ్ తక్బీర్లు

పండుగ నమాజులో - మొదటి రకాతులో తక్బీరే తహ్రీమాను మినహాయించి, ఖిరాత్ కంటే ముందు అంటే ఖుర్ఆన్ పఠనం ముందు ఏడుసార్లు తక్బీర్లు చెప్పటం, రెండవ రకాతులో కూడా ఖిరాత్‌కు ముందు ఐదు సార్లు తక్బీర్లు పలకటం సున్నత్. ప్రవక్త సహచరులు మరియు సహచరులను కళ్ళారా చుసిన వారి విధానం కూడా ఇదే.

నమాజు ముగిసిన తర్వాత సాముహిక దుఆ చేయాలని ఎక్కడా లేదు. కనుక ఎవరికీ వారు వ్యక్తిగతంగా దుఆ చేసుకోవచ్చు .

## పండుగ ప్రసంగం

పండుగ రోజున పండుగ నమాజు అనంతరం ప్రసంగించటం సంప్రదాయం. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సాయిబ్ (రజిఅల్లా అన్హు) ఉల్లేఖించారు - ఒక పర్వదినాన నేను మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంట ఈద్‌గాహ్‌లో ఉన్నాను. నమాజు చదివించటం పూర్తయ్యాక, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు, ఇప్పుడు మేము ప్రసంగించనున్నాము. కూర్చోదలచినవారు కూర్చుని ప్రసంగం వినవచ్చు, వెళ్ళదలచిన వారు వెళ్ళవచ్చు. (అబూదావూద్ ,నిసాయి ,ఇబ్నెమాజ)

## రమదాన్ నెలలో ఖుర్ఆన్ చదవటం ఎలా?

1. ఈ రమదాన్ నెలలో దివ్యఖుర్ఆన్ మొత్తం చదవాలని కోరుకుంటున్నారా?
2. మీరు చేయవలసినదల్లా ప్రతి ఫర్జ్ నమాజ్ తరువాత నాలుగున్నర పేజీలు చదవటమే.
3. ఒకసారి దీనిని పరిశీలించండి : పేజీలు(4.5) ప్రతిదిన నమాజులు(5) దినములు(30) (604)దివ్యఖుర్ఆన్ లోని మొత్తం పేజీలు.
4. ప్రతి నమాజు తరువాత కేవలం కొన్ని నిమిషాలు వెచ్చించటం ద్వారా చాలా సులభంగా ప్రతి నెలలో ఒకసారి మొత్తం ఖుర్ఆన్ పూర్తిగా చదవుకోవచ్చు. ఎంత లాభదా యకమైన పెట్టుబడి!

   ఒకవేళ మీరు బిజీగా ఉంటే, ప్రతి నమాజు తరువాత కేవలం రెండు పేజీలు చదవటం ద్వారా ప్రతి రెండు నెలలలో ఒకసారి ఖుర్ఆన్ పూర్తిగా చదవుకోవచ్చు.

   నమ్మలేక పోతున్నారు కదూ?
5. గుర్తుంచుకోండి! దివ్యఖుర్ఆన్‌లో మీరు చదివే ఒక్కో అక్షరానికి బదులుగా 10పుణ్యాలు మీ ఖాతాలో జమ చేయబడతాయి.

   మరి ఒక్కో పదానికి బదులుగా?

   ఒక్కో పంక్తికి బదులుగా?

   ఒక్కో పేజీకి బదులుగా?

   ఒక్కో అధ్యాయానికి బదులుగా?

   మొత్తం ఖుర్ఆన్ చదివినందుకు బదులుగా? అల్లాహ్ మీకు శుభాల్ని కలుగజేస్తాడు.

# షబె ఖద్ర్ మరియు ఏతెకాఫ్

- మౌలానా ముహమ్మద్ ఉబైదుర్రహ్మాన్,

ముస్లిం సోదరులారా! అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఒక చోట ఈ విధంగా పేర్కొన్నాడు: " నిస్సందేహంగా మేము ఈ ఖుర్‌ఆన్‌ను షబెఖద్ర్ న అవతరింపజేశాము. షబెఖద్ర్ అంటే ఏమిటో మీకు తెలుసా? షబెఖద్ర్ వెయ్యి మాసాల కంటే శ్రేష్ఠమైనది. మీ ప్రభువ ఆజ్ఞ మేరకు ఆయన దూతలు మరియు పరిశుద్ధాత్మ (దైవదూత హజ్రత్ జిబ్రయిల్ (అ) ) ఈ రాత్రివేళ అవతరిస్తాయి. ప్రతి మంచి పని కొరకూ శుభం. అది సూర్యోదయం వరకు కొనసాగుతుంది "

గౌరవనీయ మహాశయులారా! ప్రపంచంలో లభ్యమయ్యే వస్తువులన్నీ సమానం కాజాలవు. దైవంచే రూపొందించబడిన వ్యవస్థ యొక్క విశిష్టశైలి ఏమిటంటే దైవం తన దాసులలో నుంచి ఒక దాసుడి స్థాయిని పెంచివేసి ఒక జాతికి నాయకత్వం వహించేందుకై ఎంచుకోవడం జరుగుతుంది. అలాగే దైవం కొందరిని పాలితులుగా చేసి వారికి విధేయులుగా రూపొందించడం జరుగుతుంది. ఈ విధంగా జంతువులతోనూ వృక్షాల తోనూ, సజీవులతోనూ, నిర్జీవులతోనూ వ్యవహరించడం జరుగుతుంది.

ప్రపంచంలో ఎంతో మంది దైవప్రవక్తలు ప్రభవించారు. అయితే ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) కు ఎటువంటి స్థాయిని అల్లాహ్ ప్రసాదించడం జరిగిందో దానికి సంబంధించిన ఊహ సైతం ఎవరి మస్తిష్కంలోనూ ఉనికిలో లేదు. మానవ సమాజాలన్నింటిలోకెల్లా ఉత్తమ సమాజంగా అల్లాహ్ ఆఖరి దైవప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (స) అనుచర సమాజాన్ని రూపొందించాడు. 'ఉత్తమ సమాజం' అనే బిరుదునిచ్చి అల్లాహ్ వారి స్థాయిని ప్రస్ఫుటీకరించాడు. అదేవిధంగా అన్ని గ్రంథాలలోకెల్లా ఖుర్‌ఆన్‌ను ఉత్కృష్టమైన గ్రంథంగా అల్లాహ్ పేర్కొన్నాడు. అదేవిధంగా మాసాలన్నింటిలోకెల్లా ఉత్కృష్టమైన మాసంగా అల్లాహ్ రమదాన్ మాసాన్ని పేర్కొన్నాడు. అలాగే రాత్రులన్నింటిలో కెల్లా షబె ఖద్ర్‌ను ఉన్నతమైనదిగా అల్లాహ్ పేర్కొన్నాడు. ఆ రాత్రి విశిష్టత గురించి వెల్లడిస్తూ అల్లాహ్ ' ఖద్ర్ ' పేరుతో ఒక సూరాహ్‌నే అవతరింపజేయడం జరిగింది.

షబె ఖద్ర్ గా పిలువబడే రాత్రి యొక్క ప్రతి ఘడియ మరియు ప్రతి నిమిషం శుభప్రదమైనది, పుణ్యప్రదమైనది. ఈ రాత్రి విశిష్టత రీత్యా అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌ను అవతరింపజేశాడు. ఈ రాత్రి విశిష్టతను వెల్లడిస్తూ అల్లాహ్ 'ఖద్ర్' అనే సూరహ్‌ను అవతరింపజేశాడు, ప్రజల హృదయాలలో దాని నిజమైన ప్రాముఖ్యత ప్రతిష్ఠించబడేందుకై మరియు అమూల్యమైన ఈ రాత్రి శుభాలను కోల్పోకుండా ఉండేందుకై. ఈ రాత్రివేళ ఆరాధన వెయ్యి మాసాల ఆరాధన కంటే విలువయినదిగా పరిగణించబడి అల్లాహ్‌చే స్వీకరించబడుతుంది. సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు ఈ రాత్రి యొక్క శుభాలు అవతరిస్తూనే ఉంటాయి. అన్ని దిశల్లోనూ చల్లని గాలులు, అల్లాహ్ స్మరణ మరియు సోత్రాలు పరివ్యాప్తమవుతూ ఉంటాయి. దైవదూతలు మానవులపై కారుణ్యం చూపవలసిందిగా అల్లాహ్‌ను ఈ రాత్రివేళ ప్రత్యేకంగా ప్రార్థించడం జరుగుతుంది. ఈ రాత్రివేళ ఆకాశ వాతావరణం ఎంతో మనోహరంగా ఉంటుంది. ఎంతటి కనులకు ఇంపయిన దృశ్యమో గదా! ప్రపంచంలోని వస్తువులన్నీ ఎంతో గౌరవప్రదమైన రీతిలో సృష్టికర్త ముందు మోకరిల్లుతూ ఉంటాయి. మస్జిద్‌ల మీనార్ల నుంచి అల్లాహ్ స్తోత్రాలకు సంబంధించిన

ధ్వనులు మిన్నంటుతూ ఉంటాయి. ఈ రాత్రిని అన్వేషిస్తూ కృషి చేసి ఎంతో కొంతసేపు ఈ రాత్రివేళ అల్లాహ్ దర్బారులో హాజరయి ఆయన ఆరాధనలో నిమగ్నమయిన దాసుడు ఎంతటి సౌభాగ్యవంతుడో గదా! అల్లాహ్ సాన్నిధ్యంలో ఉండే దూతలు సైతం అటువంటి దాసుని మన్నింపు కొరకు ప్రార్థించడం జరుగుతుంది మరియు అతడితో కరచాలనం కొరకు హస్తాలను చాచడమూ జరుగుతుంది, ఆ విషయాన్ని మనం ప్రత్యక్షంగా గ్రహించలేకపోయినప్పటికీ ! అయితే ఇంతటి మహోన్నత రాత్రి విలువను సైతం గుర్తించకుండా ఈ రాత్రివేళ సైతం సృష్టికర్త ఆరాధనలో నిమగ్నమవకుండా ఏమరుపాటుతో నిర్లక్ష్యంగా గడిపివేసిన వ్యక్తి ఎంతటి దౌర్భాగ్యుడో గదా ! అటువంటి వ్యక్తికి పశ్చాత్తాపంతో నిట్టూర్పు విడవడం మినహా ఒరిగేది ఏమీ లేదు. అటువంటి వ్యక్తి గురించే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఈ రాత్రి శుభాలకు దూరమయిపోయిన వ్యక్తి అన్ని వస్తువులకూ దూరమయిపోయాడు"

హజ్రత్ అనస్(ర) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) దైవదూతల ఒక బృందంతో పాటు భువిపైకి వస్తారు. వారు నిలబడి లేదా కూర్చొని అల్లాహ్ ఆరాధనలో నిమగ్నులయి ఉన్న దాసుల మన్నింపు కొరకు అల్లాహ్‌ను ప్రార్థిస్తారు."

అదేవిధంగా మరొక హదీసు ఉల్లేఖనంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: " ఏ వ్యక్తయితే విశ్వాసం మరియు పుణ్యఫలం లభిస్తుందని సంకల్పిస్తూ షబెఖద్ర్ లో నఫిల్ నమాజులు చదువుతాడో అతడి పూర్వపు పాపాలన్నీ క్షమించివేయబడతాయి. అయితే షబెఖద్ర్ తేదీని అల్లాహ్ నిర్ణయించలేదు. ప్రజల ఆసక్తి మరియు ఉత్సాహం పై దానిని విడచిపెట్టాడు. తద్వారా దాసులు తమ మనోవాంఛలపై అదుపును సాధించేందుకు కృషి చేసేందుకు అవకాశం లభించింది. అలాగే దాసులలో షబె ఖద్ర్‌ను పొందే విషయంలో నిజమైన తపన జనించేందుకు అవకాశం లభించింది. ప్రపంచంలో వ్యాపారం చేసేవారికి ఫలానా పట్టణంలో ఫలానా నెలలో ఒక సంత నిర్వహించబడుతుందని, అందులో లక్ష రూపాయల లాభం చేకూరుతుందని ముందుగానే తెలిసినట్లయితే ఏ వ్యక్తి అటువంటి అవకాశాన్ని వదులుకుంటాడు? ఒకవేళ ఆ సమాచారాన్ని అందజేసిన వ్యక్తి దానికి సంబంధించిన తేదీని తెలియజేయనప్పటికీ వ్యాపారి తప్పకుండా ఆ తేదీని ఏదో ఒక రీతిలో కనుగొని తీరతాడు. ఒకవేళ ఆ తేదీ విషయంలో సందేహం తలెత్తిన పక్షంలో కొన్నిరోజుల ముందే ఆ ప్రదేశానికి అతడు చేరుకుంటాడు. అదేవిధంగా షబె ఖద్ర్ సైతం పుణ్యఫలాలతో కూడిన సంత. అది ముస్లింలకు ప్రసాదించబడుతోంది. అయితే షబె ఖద్ర్ ఏ నెలలో వస్తుందో తెలియజేయబడడంతో పాటు నెలలోని ఆఖరి పది రోజుల్లో వస్తుందని కూడా తెలియజేయబడింది. తద్వారా పుణ్యఫలాల పట్ల ఆసక్తిని కలిగియున్నవారు, అల్లాహ్ పట్ల మరియు దైవప్రవక్త పట్ల ప్రేమానురాగాలను కలిగియున్నవారు ఎన్నిరోజుల పాటు తమ సుఖాలను త్యజించి షబె ఖద్ర్‌ను అన్వేషించడంలో నిమగ్నులవుతారో తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

అందుకే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: ''తేదీ గురించి మీకు తెలియజేయక పోవడంలోనూ మీ కొరకు శుభం ఉంది. ఈ విషయాన్ని గుప్తంగా ఉంచడంలో మర్మమేమిటంటే దానిని అన్వేషించడంలో భాగంగా దాసులు రమదాన్ మాసమంతా అల్లాహ్ ఆరాధనలో నిమగ్నులయ్యే అవకాశముంది.

సంపాదించుకునే సీజన్ వచ్చినప్పటికీ దానిని కోల్పోయే వ్యక్తియే ప్రపంచంలో అందరిలోకెల్లా దురదృష్టవంతుడు. అయితే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) దృష్టిలో పుణ్యఫలాలను ఆర్జించేందుకు దోహదపడే సీజన్

వచ్చినవ్పటికీ ఆ అమూల్యమైన అవకాశాన్ని జారవిడుచుకునే వ్యక్తి అందరిలోకెల్లా దురదృష్టవంతుడు. మిత్రులారా! ప్రపంచాన్ని ఆర్జించేందుకై ప్రజలు రాత్రంతా మేల్కొంటారు, నిలబడి సైతం పని చేసేందుకు వెనుకాడరు, రాత్రింబవళ్ళూ యంత్రం వలె పనిచేస్తారు. అన్ని రకాల కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొంటారు. వారు ఆ క్రమంలో తమ ఆరోగ్యాన్నీ పట్టించుకోరు, సుఖాల గురించీ పట్టించుకోరు. అయితే ఎంతో శోచనీయమైన విషయమేమిటంటే ధర్మాన్ని ఆర్జించేందుకై మన వద్ద తీరికే ఉండదు. దైవం కొరకు కనీసం ఒక్క రాత్రయినా మేల్కొనేందుకు సైతం మనం సిద్ధంగా లేము.

మరణానికి ముందరి జీవితం కొరకయితే సన్నద్ధులమవుతామే గానీ మరణానంతర జీవితం కొరకు మాత్రం ఏవిధంగానూ సన్నద్ధులమవము, చింతించము. మరణానంతర జీవితం కొరకు ఎవరు సన్నద్ధులవాలి? ఎవరయితే మరణించబోతున్నారో వారు సన్నద్ధులవవలసిన ఆవశ్యకత ఉంది. అయితే మనం మరణించము గదా! అయ్యో ! మనం ఎంతటి ఏమరు పాటులో ఉన్నామో గదా !

ముస్లింలారా! కొంచెం ఆలోచించవలసిన విషయమేమిటంటే కేవలం అరవై లేదా డెబ్భై సంవత్సరాల జీవితం కొరకు మానవుడు ఎక్కడెక్కడో తిరుగుతాడు, ఏమేమో చేస్తాడు. కానీ ఎన్నటికీ అంతం కాని, మరణమంటూ లేని శాశ్వతమైన పరలోక జీవితం కొరకు రాత్రింబవళ్ళూ మనం కృషి చేయవలసిన ఆవశ్యకత లేదా? ప్రియతమ ప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) షబెఖద్ర్ పట్ల ఎంతగా శ్రద్ధ వహించేవారంటే రమదాన్ మాసం ప్రారంభం ప్రారంభమవడంతోటే, అనగా మొదటి పది రోజులపాటు ఏతెకాఫ్ పాటించారు. అందులో షబెఖద్ర్ లభించకపోవడంతో రమదాన్ నెల రెండవ భాగంలో, అనగా 11 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు గల పది దినాల పాటు ఏతెకాఫ్‌ను పాటించారు. అయితే అందులో సైతం షబెఖద్ర్ లభించకపోవడంతో రమదాన్ మాసం చివరి 10 రోజులపాటు ఏతెకాఫ్‌ను పాటించారు. ఇక అప్పటినుంచి ప్రతి సంవత్సరం రమదాన్ మాసంలో చివరి 10 రోజులపాటు ఆయన (స) ఏతెకాఫ్‌ను పాటించారు.

మహాశయులారా!

షబెఖద్ర్ ఎప్పుడు వస్తుంది? ఏ తేదీన వస్తుంది? అనే విషయాలకు సంబంధించిన సమాచారం తెలియజేయబడలేదు. హజ్‌రత్ ఉబాదహ్ బిన్ సాబిత్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: ఒక పర్యాయం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ప్రజలకు షబెఖద్ర్ గురించి తెలియజేసేందుకై బయలుదేరారు. అయితే ఇద్దరు ముస్లింలు పరస్పరం కలహించుకోసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను మీకు షబెఖద్ర్ గురించి తెలియజేసేందుకై బయలుదేరాను. కానీ ఫలానా వ్యక్తులు కలహించుకో సాగారు. ఆ కారణంగా దానికి సంబంధించిన సమాచారం వెనక్కు తీసుకోబడింది. కనుక ఇక ఇప్పుడు ఏ మాసంలో ఏ తేదీన షబెఖద్ర్ వస్తుందనే విషయం గురించి చెప్పలేము. అయితే షబెఖద్ర్‌ను అన్వేషించవలసిందిగా ఆదేశం ఇవ్వబడింది. తద్వారా షబెఖద్ర్‌ను అన్వేషించే క్రమంలో పలు రాత్రులు దైవారాధనలో దాసులు గడిపేందుకు అవకాశం ఏర్పడింది. ఆ విధంగా దాసుడు వీలయినంత ఎక్కువగా పుణ్యఫలాలను ఆర్జించే అవకాశముంది. అయితే పలు హదీసు ఉల్లేఖనాల ద్వారా విదితమయిన విషయమేమిటంటే షబెఖద్ర్ రమదాన్ మాసంలోని చివరి పది దినాలలో వస్తుందనే విషయం విదితమయింది. అందులోనూ రమదాన్ మాసం చివరి 10 రోజులలోని బేసి రాత్రులలో (అనగా 21 వ, 23 వ, 25 వ , 27వ మరియు 29వ రాత్రులలో) షబెఖద్ర్ వచ్చేందుకు అవకాశముంది. మరీ ముఖ్యంగా రమదాన్ నెల 27 వ తేదీ రాత్రి షబెఖద్ర్ అయ్యేందుకు ఎక్కువగా అవకాశముందనేది పండితుల అంచనా. రమదాన్ నెల

27వ తేదీ షబెఖద్ర్ అయి ఉంటుందని ఎంతోమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

అల్లామా ఇబ్నుల్ మునీర్(ర) ఒక ముఖ్యమైన విషయాన్ని ఈ విధంగా పేర్కొన్నారు: " షబెఖద్ర్ అనేది గొప్ప మహానుభావులయిన వ్యక్తులకు, దైవానికి ప్రీతిపాత్రులయిన దాసులకు మాత్రమే లభిస్తుంది. అల్లాహ్ తాను తలచినవారికి షబెఖద్ర్‌ను ప్రసాదిస్తాడు. కనుక షబెఖద్ర్‌ను అన్వేషిస్తూ ప్రతి వ్యక్తీ ప్రయత్నించ వలసిన ఆవశ్యకత ఉంది" (నీలుల్ ఔతార్: సంపుటి - 4, పేజీ : 294)

ఈ కారణంగానే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) రమదాన్ మాసం చివరి పది రోజుల్లో అత్యధికంగా దైవారాధనలో నిమగ్నమవడం పట్ల ఎంతో శ్రద్ధను కనబరిచేవారు. హజ్రత్ ఆయిషహ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) రమదాన్ నెల ఆఖరి పది రోజుల్లో ఆరాధనల్లో ఎంత ఎక్కువగా నిమగ్నమయ్యేవారో అంతటి స్థాయిలో మిగిలిన దినాలలో నిమగ్నమయ్యేవారు కాదు"

ఇదేవిధంగా 'బుఖారీ' అనే హదీసు గ్రంథంలో పేర్కొనబడియున్న మరొక హదీసు ఉల్లేఖనంలో ఈ క్రింది విధంగా ఉంది : " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) రమదాన్ మాసం ఆఖరి పది రోజులు పూర్తిగా అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమయ్యేవారు. రాత్రంతా మేల్కొని ఆరాధనలో గడిపేవారు. అలాగే తన ఇంటి వారిని సైతం మేల్కొని వారు సైతం వీలయినంత ఎక్కువగా దైవారాధనలో నిమగ్నులయ్యేలా చేసేవారు.

హజ్రత్ అలీ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: "దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) రాత్రివేళ ఎవరెవరయితే నమాజ్ చదవగలరో వారందరినీ నమాజ్ కొరకు మేల్కొలిపేవారు. " వాస్తవానికి రమదాన్ నెలకు చెందిన విలువయిన రాత్రింబవళ్ళు ఆరాధనలో నిమగ్నమయ్యేందుకు ఉద్దేశించబడ్డాయి. ఎంతోమంది దాసులు రమదాన్ నెలలోని ఒక్కొక్క నిమిషాన్ని ఒక్కొక్క మాసంగా భావించి సద్వినియోగం గావించుకుంటారు. వారు ఒక్కొక్క దినం ఒక్కొక్క మాసంగా మారిపోతే బాగుండునని ఆశిస్తారు. వారు తమ ప్రభువు ముందు సజ్దహ్ చేసినప్పుడు అశ్రువులు చిందిస్తూ ' ఈ దినాలు ముగిసి పోకపోతే బాగుండును' అని కోరుకుంటారు.

మహాశయులారా! షబెఖద్ర్ కొరకు నిర్ణీత తేదీ ఏదీ లేదు. అయితే హదీసులలో షబెఖద్ర్‌కు సంబంధించిన కొన్ని సంకేతాలు కూడా తెలియజేయ బడ్డాయి. వాటి ద్వారా షబెఖద్ర్‌ను తెలుసుకోవడం సులభతరమయిపోతుంది. ఏ రాత్రిలోనయితే ఆ సంకేతాలు కనబడతాయో దానినే షబెఖద్ర్‌గా భావించాలి. ఆ రాత్రి పున్నమినాటి వలె చంద్రుడు కిరణాలను ప్రసరించకుండా సాధారణ రాత్రులలో కంటే తక్కువ స్థాయి కాంతితో ప్రకాశిస్తూ ఉంటాడు. ఈ విషయాన్ని ఎంతోమంది అనుభవపూర్వకంగా గుర్తించారు.

రెండవ సంకేతమేమిటంటే ఆ రాత్రి ప్రఫుల్లంగా, కాంతివంతంగా ఉంటుంది. (ఐనీ షరహ్, సంపుటి-5, పేజీ: 365).

మూడవ సంకేతమేమిటంటే ఆ రాత్రి వేళ ఆకాశంలోని నక్షత్రాలు అటూ ఇటూ పయనించవు. నాల్గవ సంకేతాన్ని ఇమామ్ ఇబ్నె జరీర్ తిబ్రీ(ర) పలువురు మహానుభావుల ద్వారా ఈ విధంగా తెలియజేశారు. ఆ సంకేతమేమిటంటే ఆ రాత్రివేళ ప్రతి వస్తువూ భువిపై వంగి సజ్దహ్ చేసి తిరిగి యథాస్థితికి చేరుకుంటుంది. అయితే ఈ సంకేతాలన్నీ అందరికీ కనిపించవు. ఒకవేళ అన్వేషించిన పిదప ఈ సంకేతాలలో కొన్ని లేదా అన్నీ గోచరించి షబెఖద్ర్ గురించి తెలిసిన పక్షంలో ఏ విధంగా ఆరాధించాలి? ఏ విధంగా ప్రార్థించాలి?

హజ్రత్ ఆయిషహ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించాను: 'ఒకవేళ నేను ఈ రాత్రిని పొందినట్లయితే ఏమి చేయను?' అప్పుడు దైవ

